
7

సాక్షి చిత్తూరు

సోమవారం । 16 । డిసెంబర్ । 2024



తేజోమయం


ఆలయంలో కార్తీక దీపాల శోభ

తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం కార్తీక పౌర్ణమి దీపోత్సవాన్ని టీటీడీ కనుల పండువగా నిర్వహించింది. ఈ దీపోత్సవంలో మొదట శ్రీ యోగనరసింహ స్వామి ఆలయం పక్కన 80 కొత్త మూకుళ్లతో దీపాలను వెలిగించారు. తదుపరి వీటిని ఛత్రచామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ, ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇచ్చారు. ఆ తర్వాత స్వామివారి పుష్కరిణి వద్ద సుమారుగా వెయ్యి నేతి జ్యోతులను ఏర్పాటు చేశారు. కార్తీక దీపోత్సవం కారణంగా టీటీడీ పౌర్ణమి గరుడ సేవను రద్దు చేసింది.

– తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయంలో కార్తీక దీపాన్ని వెలిగిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా చండీ హోమం



చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి ఉత్సవమూర్తిని యాగశాలలో నెలకొల్పారు. ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరంతోపాటు ఉభయదారులచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేక పూజలు చేశారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున నిర్వహించే ఈ చండీ హోమ పూజలకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పూర్ణాహుతి అనంతరం అధికారులు ఉభయదారులకు అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం చేయించారు.

భక్తి గీతాలాపన రేపు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో మంగళవారం మన సంస్కృతి, కళాసంస్థ ఆధ్వర్యంలో భక్తి భజన గీతాలు, జానపద గీతాల ఆలాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఆస్థాన మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు, ఉభయదారులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయం ఎదురుగా వెలసి ఉన్న శ్రీ బేడి ఆంజనేయ స్వామివారికి ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రతి సంవత్సరం ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆంజనేయ స్వామి ఆలయంలో మూల మూర్తికి ఉదయం పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపులతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు.

విస్తరణం

చిత్తూరులో టీడీపీ నాయకులు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు వివాదానికి దారితీశాయి. పరిహారం ఇవ్వకుండా రోడ్డు విస్తరణ పనులు చేపడితే అంగీకరించేది లేదని వ్యాపారులు రోడ్డెక్కారు. మరో వైపు ఆదివారం జరిగిన హై రోడ్డు వ్యాపారుల సర్వసభ్య సమావేశం రెండు వర్గాల మధ్య గొడవలకు ఆజ్యం పోసింది. అయినా మున్సిపల్ అధికారులు మాత్రం జేసీబీలతో కూల్చివేతలు మొదలెట్టేశారు. ఏటీఎంను ధ్వంసం చేస్తూ ముందుకెళుతున్నారు. అటు పాలకులు, ఇటు అధికారులు వ్యాపారుల గోడు పట్టించుకునే స్థితిలో లేరు.


హైరోడ్డులోని భవనాన్ని జేసీబీలతో తొలగిస్తున్న దృశ్యం

చిత్తూరు హైరోడ్డు విస్తరణ పనుల్లో వివాదం

- పరిహారం ఇచ్చి పనులు చేపట్టాలంటూ రోడ్డెక్కిన వ్యాపారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- మసీదు పక్కన ఏటీఎం కూల్చివేత

చిత్తూరు అర్బన్/రూరల్ (కాణిపాకం): చిత్తూరులో రోడ్డు విస్తరణకు సంబంధించి ఇటీవల అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు మార్కింగ్ చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ 40-60 అడుగుల రోడ్డు ఉంది. దీన్ని మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగులకు విస్తరించాలన్నది ప్రతిపాదన. అయితే పాలకులు అధికారుల ప్రతిపాదనలపై చర్చించడానికి ఆదివారం చిత్తూరు హై రోడ్డు వ్యాపారుల కమిటీ సమావేశం అయింది. ఇందులో యూనియన్ నాయకులు మాట్లాడుతూ పరిహారం ఇవ్వకుండా రోడ్డును విస్తరణ పనులు చేపడితే ఏమాత్రం ఒప్పుకునేది లేదని తేల్చి చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు చెబుతున్నట్టు టీడీఆర్ బాండ్లు ఇస్తే తీసుకునే ప్రసక్తే లేదని హైరోడ్డు వ్యాపారుల కమిటీ స్పష్టం చేసింది. ఇందులో సుప్రీం తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలా కాదని ముందుకు వెళితే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు.

నాడు బాబుకు వ్యతిరేకంగా పవన్

చిత్తూరులో 2019కి ముందు విస్తరణ పనులు ప్రారంభించారు. అయితే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జనసేన తరపున ఆ పార్టీ నాయకుడు పవన్ కల్యాణ్ చిత్తూరుకు వచ్చారు. పరిహారం ఇవ్వనిదే హైరోడ్డులో ఒక్క అడుగు కూడా విస్తరించడానికి వీల్లేదంటూ భీష్మ ప్రతిజ్ఞ చేశారు. దీంతో విస్తరణపై నాటి టీడీపీ ప్రభుత్వం ముందుకు వెళ్లలేకపోయింది. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో బాబు- పవన్ ఇద్దరు ఉన్నప్పటికీ రోడ్డును విస్తరించాల్సిందే అంటూ ప్రజాప్రతినిధుల ద్వారా చెప్పిస్తున్నారు. దీనిపై వ్యాపార వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అధికారంలో ఉంటే ఒకలా ప్రతిపక్షంలో ఉంటే మరోలా మాట్లాడడం సరికాదు అంటూ వ్యాపారులు కూటమి ప్రభుత్వానికి చురకలంటిస్తున్నారు.


రోడ్డెక్కిన హైరోడ్డు బాధితులు


సంఘటన స్థలంలో పోలీసులు

తెరపైకి టీడీఆర్ బాండ్లు

వ్యాపారుల ప్రతిపాదనను అధికార పార్టీ నాయకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రోడ్డు విస్తరణ చేస్తే పరిహారం ఇవ్వాల్సిన అవసరం లేదని పెద్ద పెద్ద నగరాల్లో సైతం ఇదే పద్ధతిని పాటిస్తున్నారని గుర్తు చేస్తున్నారు. ఇంకా చెప్పాలంటే పై రోడ్డులో భవనాలున్న పలువురి వద్ద స్పష్టమైన రికార్డులు కూడా లేవని చెబుతున్నారు. అయినా సరే మానవతా దృక్పథంతో ఆలోచించి విస్తరణ విషయంలో స్థలం కోల్పోతున్న భవన యజమానులకు న్యాయపరంగా టీడీఆర్ బాండ్లను ఇస్తామని కుండబద్దలు కొట్టినట్టు తేల్చి చెబుతున్నారు. విశాఖ-విజయవాడ గ్రేటర్ కార్పొరేషన్‌తోపాటు పక్కనున్న తిరుపతి నగరంలోనూ ఇదే పద్ధతిని అవలంబించారని అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు. వ్యాపారులు దీనికి ఒప్పుకోని పక్షంలో చిత్తూరు అభివృద్ధికి ద్రోహం చేసినట్లు అవుతుందనేది వారి వాదన. ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా రోడ్డు విస్తరణ పూర్తి చేసి ముందుకు వెళితే మరో ఏడాదిలో ఈ విషయాన్ని అందరూ మర్చిపోతారని అధికార పార్టీ నాయకులు భావిస్తున్నారు.

అయినా అధికారులు ముందుకే

వ్యాపారుల వాదనను కార్పొరేషన్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. తమకున్న ఆదేశాల ప్రకారం రోడ్డు విస్తరణను పూర్తిచేసే తీరుతామని భీష్మించుకుని పనులు చేసుకుంటూ ముందుకు వెళుతున్నారు. ఇందులో భాగంగా హైరోడ్డులో ఉన్న మసీదు పక్కన ఏటీఎంను ధ్వంసం చేశారు. ఏటీఎంలో ఎంత నగదు ఉందో కూడా అధికారులు చెప్పకపోవడం గమనార్హం. అందులో ఉన్న ఏసీలు కూడా పాడైపోయాయి. దాని పక్కనే ఉన్న మరో దుకాణాన్ని కూడా కూల్చేశారు. మసీదు కమిటీ నాయకులు రోడ్డు విస్తరణకు సహకరిస్తున్నట్లు తమకు రాతపూర్వకంగా లేఖ ఇవ్వడంతోనే మసీదు స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీనిపై మరోవర్గం అభ్యంతరం లేవనెత్తింది. ప్రైవేటు స్థలాన్ని రాసి ఇచ్చే అధికారం కమిటీకి లేదని ఆందోళనకు దిగింది. ఓ వర్గం రోడ్డు విస్తరణకు సహకరిస్తామని చెబుతుండగా మరో వర్గం దీన్ని వ్యతిరేకిస్తుండడంపై మరో వివాదం తలెత్తింది. ఈ వివాదం ముదరడంతో పోలీసులు రంగం ప్రవేశం చేశారు. రోడ్డు భవన సంఘ సభ్యులకు నచ్చచెప్పి పంపించారు.

అన్యాయం చేస్తే పుట్టగతులుండవ్



హైరోడ్డు విస్తరణపై అధికారంలో లేనప్పుడు పవన్‌కల్యాణ్ మమల్ని పరామర్శించారు. ఇప్పుడు డిప్యూటీ సీఎంగా ఉండి ఇలా చేయడం తగదు. అధికారం లేనప్పుడు ఒక రూల్.. అధికారం లేనప్పుడు ఒక రూలా? అన్యాయం చేస్తే.. కచ్చితంగా పుట్టగతులుండవ్. మాకు న్యాయం చేసి మీకు ఎంత కావాలో తీసుకోండి. అంతే కానీ కూరగాయాల మార్కెట్‌లాగా పాట పాడొద్దు. దొంగ చాటుగా బిల్డింగ్‌లు కొడితే నాశనమైపోతారు.

– రాజరత్నంనాయుడు, హైరోడ్డు భవన సంఘ సభ్యులు

అడ్డదారిలో కూల్చడం సరికాదు



అడ్డదారిలో బిల్డింగ్‌లను కొట్టేయాలని చూస్తున్నారు. మానవీయ కోణంలో ఆలోచించండి. హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి భవనాలను కూల్చడం సరికాదు. ఇది చట్ట రీత్యా నేరం. ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రజలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలి. అందరి అభిప్రాయాన్ని సేకరించి, మాకు న్యాయబద్ధ పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. టీడీఆర్ ఇస్తే మాకు వద్దు. హైరోడ్డు విస్తరణకు సంబంధించి మాతో ఎవరూ మాట్లాడలేదు.

– వెంకటేశ్వర్లు, హైరోడ్డు భవన సంఘ సభ్యులు

వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే మూలస్తంభాలు

- అధికారంలోకి రాకపోయినా కార్యకర్తల్లో చెదరని ఉత్సాహం
- కూటమి సర్కారు ఇచ్చిన హామీలను నిలదీయాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి


పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న భూమన కరుణాకర రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, డాక్టర్ సునీల్‌కుమార్

తవణంపల్లె: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే మూలస్తంభాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలిచి ఆయన నాయకత్వాన్ని బలపరచాలని చిత్తూరు ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని సిద్ధంపల్లె సమీపంలో ఉన్న నారాయణాద్రి కల్యాణ మండపంలో ఆదివారం పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా స్వాతంత్ర్య సమరయోధుడు పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి ఆయన పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కరుణాకర రెడ్డి ప్రసంగిస్తూ పేదలకు మూడు పూటలా అన్నం పెట్టాలనే సంకల్పంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షాన నిలిచారని గుర్తుచేశారు. కానీ అబద్ధపు హామీలతో వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను వంచన చేస్తోందని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నా అధికారం లేకున్నా, కూటమి నాయకులు దాడులు చేసి తప్పుడు కేసులు బనాయించినా, మనోధైర్యంతో ఉత్సాహంతో సమావేశానికి వచ్చిన కార్యకర్తలను చూస్తే ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పేదల కోసం పోరాడే జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబుకు ఇక గడ్డుకాలం

అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబుకు ఇకముందు గడ్డుకాలం ఉందని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప చెప్పారు. కార్యకర్తలు సమయమనం పాటించి పార్టీకి అండగా నిలవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. కూటమి నాయకులు సూపర్ సిక్స్ పథకాలు పెట్టి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసులు బనాయిస్తే కలసికట్టుగా ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమారరాజ, వైఎస్సార్ సీపీ తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు, బంగారుపాళెం, యాదమరి మండల అధ్యక్షులు హరిరెడ్డి, బుజ్జిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రామచంద్రారెడ్డి, ధనంజయరెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మహిళా కార్యదర్శి గౌహతిరెడ్డి, పార్టీ నాయకులు గాంధీ బాబు, రాజారత్నం రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, దత్తాత్రేయరెడ్డి, కిషోర్‌కుమార్ రెడ్డి, సుకేష్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా..

కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఇప్పటికే అసంతృప్తి ఉన్నారని పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. రానున్న కాలంలో కార్యకర్తలు ఐకమత్యంతో ప్రజల పక్షాన నిలవాలని కోరారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. గెలుపు ఓటములు సహజమని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని జగన్మోహరెడ్డికి ప్రజలు పట్టం కడతారని జోస్యం చెప్పారు. జిల్లా అధ్యక్షుడు కరుణాకర రెడ్డి నేతృత్వంలో పార్టీకి పూర్వ వైభవం తేవాలని సూచించారు.


సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం


కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న ట్రైనీ కలెక్టర్ హిమవంశీ


నివాళులర్పిస్తున్న డీఈవో వరలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్‌లో పొట్టిశ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. డీఈవో, పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు వల్లే దేశ భౌగోళిక చిత్రంలో అనేక మార్పులు వచ్చాయన్నారు. ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసం ఆయన చేసిన పోరాటం ఎనలేనిదన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు మాట్లాడే వారి కోసం పట్టుదలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు పోరాటం చేశారన్నారు. గాంధీజీ అడుగు జాడల్లో నడుస్తూ సత్యం, అహింసా మార్గాల్లో ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన మహనీయుడు అని కొనియాడారు. డీఆర్వో మోహన్ కుమార్ మాట్లాడుతూ దేశంలో మొట్టమొదట భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ జరిగిందన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు ఆద్యుడయ్యారన్నారు. గాంధీజీ కి శిష్యుడిగా జీవితం ఆరంభించి చివరి అంకం వరకు పోరాటం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీ బాషా, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. డీఈవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఈవో వరలక్ష్మి మాట్లాడుతూ సంకల్పం కోసం ప్రాణత్యాగం చేసిన ఏకైక వ్యక్తి పొట్టిశ్రీరాములు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈవో కార్యాలయం సిబ్బంది మురళి, వీజీ రమణ, గోపాల్, తదితరులు పాల్గొన్నారు. పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకులు రెడ్డి బాషా మాట్లాడుతూ నేటి విద్యార్థులు పొట్టిశ్రీరాములు గొప్పదనం తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ కళాశాల సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యల పోరాటానికి కలిసికట్టుగా పోరాడుదాం


ఒప్పంద అధ్యాపకుల జేఏసీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఒప్పంద అధ్యాపకుల సమస్యల పోరాటానికి కలిసికట్టుగా పోరాడుదామని చిత్తూరు ఉమ్మడి జిల్లా ఒప్పంద అధ్యాపకుల జేఏసీ సంఘం ముఖ్య కార్యదర్శి రెడ్డెప్పరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఆ సంఘం జేఏసీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఒప్పంద అధ్యాపకులకు ఏ సమస్య వచ్చినా పోరాడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ అంశమే ప్రధాన అజెండా అని అన్నారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఒప్పంద అధ్యాపకుల జేఏసీ సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా చంద్రప్ప, మహిళా సెక్రటరీగా కల్పనకుమారిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన బోయకొండ



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు, జంతు సంపద వృద్ధి చెందాలంటూ పలు గ్రామాల ప్రజలు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయంలో రద్దీ పెరగడంతో క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళ తాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. పోలీసులు ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

టమాటా పంటపై ఏనుగుల దాడి



ఏనుగులు ధ్వంసం చేసిన టమాటా పంట

కుప్పంరూరల్: కుప్పం మండలం, ఊరునాయునిపల్లి గ్రామం అటవీ పరిసరాల్లోని పంటలపై ఆదివారం ఉదయం ఏనుగుల గుంపు దాడి చేసింది. టమాటా, అరటి, కొబ్బరి చెట్లను తొక్కి ధ్వంసం చేసింది. ఊరునాయునిపల్లెకు చెందిన తాయప్పకు చెందిన అర ఎకరాలోని టమాటా పంటపై ఏనుగుల గుంపు దాడి చేసింది. దాడిలో టమాటా మొత్తం నేల కూలింది. దీంతో రూ.20 వేలు ఖర్చు పెట్టి సాగు చేసిన టమాటా చేతికందే సమయంలో ఇలా ఏనుగుల గుంపు దాడి చేసి నష్టపరచినట్లు బాధిత రైతు చెప్పారు. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది ఏనుగులను తమిళనాడు అడవుల వైపు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. ఆదివారం రాత్రి కుప్పం మండల సరిహద్దు అడవుల్లోనే ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు, సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు ప్రజలను హెచ్చరించారు. రాత్రి పూట ఎవరూ బయటికి రావద్దని, పొలాల వద్ద ఒంటరిగా ఉండరాదని అటవీ సరిహద్దు ప్రజలను అప్రమత్తం చేశారు.

ద్రవిడ గ్రేడ్ మారేనా.. దశ తిరిగేనా?

- న్యాక్ 'ఏ' గ్రేడింగ్‌పైనే వర్సిటీ ఉద్యోగుల ఆశలు
- జనవరిలో న్యాక్ టీమ్ విజిట్!
- ఆరు నెలలుగా ఉద్యోగులకు అందని జీతాలు



కుప్పం: ద్రవిడ రాష్ట్రాల కూడలి కుప్పంలో ద్రావిడ భాషలు, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ద్రావిడ విశ్వవిద్యాలయం అభివృద్ధివైపు కాకుండా అనేక వివాదాలతో వార్తల్లో నిలుస్తోంది. అయితే ప్రస్తుతం ద్రావిడ విశ్వవిద్యాలయానికి తొలిసారిగా 2018 సెప్టెంబరులో న్యాక్ 'బి' గ్రేడును సాధించింది. అయితే వర్సిటీకి 'ఏ' గ్రేడు సాధించకపోవడంతో వర్సిటీ అభివృద్ధి కుంటుపడింది. దీంతో పాటు వర్సిటీలోని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సైతం న్యాక్ గ్రేడింగుపై ఆధారపడి ఉండడంతో నిధుల లోటులో వర్సిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సైతం జీతాలు ఇవ్వలేకపోయారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి వర్సిటీ వీసీ ఆచార్య మధుజ్యోతి ఆధ్వర్యంలో న్యాక్ గ్రేడింగు కోసం పనులంతా పూర్తి చేశారు. అయితే ప్రభుత్వం మారడంతో ఆమె వీసీ పదవికి రాజీనామా చేయగా ప్రస్తుతం ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య దొరస్వామి ఆధ్వర్యంలో న్యాక్ పనులు కొనసాగిస్తున్నారు.

న్యాక్ గ్రేడింగు కోసం ముస్తాబవుతున్న వర్సిటీ

ఐదేళ్లకోసారి న్యాక్ గ్రేడింగు కోసం వర్సిటీలు సిద్ధం కావాల్సి ఉండగా ప్రస్తుతం ద్రవిడ వర్సిటీ న్యాక్ గ్రేడింగ్‌ను సాధించి ఆరేళ్లు పూర్తవుతుంది. దీంతో నూతన గ్రేడింగు కోసం వర్సిటీ ముస్తాబవుతోంది. ఇప్పటికే వర్సిటీ న్యాక్ గ్రేడింగు కోసం ఎస్ఎస్ఆర్‌ను సమర్పించారు. దీంతో త్వరలోనే వర్సిటీకి న్యాక్ పీర్ టీమ్ బృందం వర్సిటీని సందర్శించనున్న నేపథ్యంలో వర్సిటీలోని భవనాలకు పెయింటింగ్ పనులు, నూతన బోర్డులు, హోర్డింగులతోపాటు అన్ని భవనాల్లో హంగులతో ఏర్పాటు చేసేందుకు పనులను ముమ్మరం చేస్తున్నారు.

జనవరిలో న్యాక్ టీమ్ విజిట్!

ద్రావిడ వర్సిటీలో న్యాక్ 'ఏ' గ్రేడింగు కోసం ఇప్పటికే ఎస్ఎస్ఆర్‌ను సమర్పించారు. దీంతో జనవరిలో న్యాక్ టీమ్ విజిట్ చేసే అవకాశం ఉంది. ఈ లోపు వర్సిటీని మెరుగులు దిద్దేందుకు అధికారులు శ్రమిస్తున్నారు. గతంలో 'బి' గ్రేడుకు పరిమితమైన వర్సిటీకి ఈ సారైనా న్యాక్ 'ఏ'గ్రేడ్‌ను సాధిస్తుందో లేదో వేచి చూడాలి.

'ఏ' గ్రేడుపైనే ద్రవిడ ఉద్యోగుల ఆశలు

వర్సిటీ 'ఏ' గ్రేడును సాధిస్తేనే డిస్టెన్స్ ఎడ్యుకేషన్ మళ్లీ పునఃప్రారంభమై వర్సిటీలో నిధులకు లోటు ఉండదు. దీంతో ప్రస్తుతం 250 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు జీతాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం 6 నెలల జీతాలు చెల్లించి చేతులు దులుపుకుంది. దీంతో మరో 6 నెలలుగా వర్సిటీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు జీతాలు లేక అల్లాడుతున్నారు.

జాతీయ పోటీలకు రాగిమానుపెంట విద్యార్థులు




బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన నిరోషా, నవీన్‌కుమార్, సాఫ్ట్‌బాల్‌కు ఎంపికైన సోనియా

బంగారుపాళెం: జాతీయ స్థాయి క్రీడా పోటీలకు మండలంలోని ఎగువరాగిమానుపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ దశరథ ఆదివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ అండర్-14 బేస్‌బాల్ జట్టుకు బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన జి నిరోషా, బాలుర విభాగంలో కే నవీన్‌కుమార్ జాతీయ జట్టులో స్థానం దక్కించుకున్నారన్నారు. స్కూల్ గేమ్స్ అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీలకు బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన వి సోనియా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి 22 వరకు చత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో నిర్వహించనున్న అండర్-14 జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. జనవరిలో మహారాష్ట్రలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ అండర్-14 పోటీల్లో సోనియా ఆడుతుందని వివరించారు. జాతీయ పోటీలకు ఎంపికైన బాలబాలికలను స్థానిక సర్పంచ్ హరి, హెచ్‌ఎం సుజాత, పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

పట్టా భూమిలో రోడ్డు వేస్తారా?

- మాకు ఆత్మహత్యే శరణ్యం
- పురుగుల మందు డబ్బాతో బాధితుడి ఆక్రందన
- అధికారపార్టీతో కుమ్మక్కైన తహసీల్దార్



పురుగు మందు డబ్బాతో బాధితుడు మునస్వామి రెడ్డి

వెదురుకుప్పం: ప్రభుత్వ భూమిలో రోడ్డు వేయాల్సింది పోయి తమ పట్టాభూమిలో సిమెంటు రోడ్డు వేసేందుకు అధికార పార్టీకి చెందిన నేతలు కుట్రలు చేస్తున్నారని బాధితుడు వాపోయాడు. మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ దేవళంపేటకు చెందిన మునస్వామి రెడ్డి ఆదివారం మీడియాతో మాట్లాడాడు. ఆయన కథనం మేరకు, బొమ్మయ్యపల్లె పంచాయతీ పరిధిలోని తెట్టుగుండ్లపల్లె, జడబాపనపల్లె రెవెన్యూ పరిధిలో రోడ్డు వేసేందుకు అధికార పార్టీకి చెందిన నేతలు సన్నద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న తన పట్టా భూమిలో ఎలా వేస్తారని మునస్వామి రెడ్డి అభ్యంతరం తెలిపాడు. ఇదే విషయమై చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. పంచాయతీ రాజ్ శాఖ ఈఈ, పీఆర్ డీఈ, పీఆర్ ఏఈ, జెడ్పీ సీఈఓ, తహసీల్దార్‌తో పాటు ఇంజినీరింగ్ అధికారులకు లీగల్ నోటీసులు పంపాడు. అయినప్పటికీ కొందరు టీడీపీ నాయకులు పనిగట్టుకుని అధికార వ్యామోహంతో వెదురుకుప్పం తహసీల్దార్ రమేష్ బాబు అండదండలతో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదేమి న్యాయం అని అడిగితే బెదిరింపులకు గురిచేస్తున్నారు. కేవలం తహసీల్దార్ టీడీపీ నాయకులతో కుమ్మక్కై ఇలా కక్ష సాధింపుగా వ్యవహరిస్తున్నట్లు బాధితుడు వాపోయాడు. సిమెంటు రోడ్డు నిర్మిస్తే తమ కుటుంబమంతా పురుగుల మందు తీసుకుని ఆత్మహత్య చేసుకోవాల్సిందేనన్నాడు. ఇప్పటికైనా డిప్యూటీ సీఎం పవన కల్యాణ్ స్పందించి తనకు న్యాయం చేయాలని కోరాడు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి



వ్యవసాయ బావిలో తేలియాడుతున్న వ్యక్తి మృతదేహం (ఇన్‌సెట్) మృతుడు సుబ్రమణ్యం (ఫైల్)

తవణంపల్లె: మండలంలోని కె. పట్నం సమీపంలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కె.పట్నంకు చెందిన సుబ్రమణ్యం(74) వారం రోజుల క్రితం ఇంటి నుంచి పారిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం కె.పట్నం సమీపంలో వ్యవసాయ బావిలో శవం తేలియాడుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. బావిలో శవాన్ని వెలికితీసి పరిశీలించగా అదే గ్రామానికి చెందిన సుబ్రమణ్యంగా గుర్తించారు. శవ పరీక్ష అనంతరం పూర్తి వివరాలు చెబుతామని పోలీసులు చెప్పారు. కుమారుడు అరుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ వినయ్‌రెడ్డి తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన శ్రీరాములు

పుంగనూరు: వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు, పట్టణ సమీపంలోని వెంకట్రాది కాలనీకి చెందిన శ్రీరాములు(55) శనివారం రాత్రి రోడ్డుపై నిల్చుని ఉండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. దీనిని గమనించిన ఆ ప్రాంత వాసులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. తీవ్రంగా గాయపడిన శ్రీరాములును కుటుంబ సభ్యులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో శ్రీరాములు మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పట్టణంలోని నక్కబండకు చెందిన శ్రీరాములు(45) సైకిల్‌పై తన పనుల నిమిత్తం పట్టణానికి బయల్దేరాడు. పట్టణానికి చెందిన బొలేరో జీపు వెనుక వైపు నుంచి వచ్చి శ్రీరాములు సైకిల్‌ను ఢీకొని బొలేరో అదుపుతప్పి పక్కకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శ్రీరాములుకు తీవ్రంగా, జీపులో ప్రయాణిస్తున్న ముజాహిద్దీన్(32), నూర్ అహమ్మద్(18)కు స్వల్పంగా గాయాలయ్యాయి. దీనిని గమనించిన ఆప్రాంత వాసులు శ్రీరాములును స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ కళాశాలల బోధనేతర సంఘం అధ్యక్షుడిగా హరిప్రసాద్



ఎన్నికైన నూతన సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల బోధనేతర సిబ్బంది సంఘం జిల్లా అధ్యక్షుడిగా హరిప్రసాద్ (పీవీకేఎన్ కళాశాల) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా బోధనేతర సిబ్బంది సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సెక్రటరీగా విద్యాసాగర్ (కుప్పం డిగ్రీ కళాశాల), జాయింట్ సెక్రటరీగా రసూల్‌భాషా (పీవీకేఎన్), ట్రెజరర్‌గా కమల్‌బాబు (వాయల్పాడు), అసోసియేట్ అధ్యక్షుడిగా రియాజ్ (పలమనేరు), ఆర్గనైజింగ్ సెక్రటరీగా శివకవి (పీలేరు), గౌరవ అధ్యక్షుడిగా దొరైకన్నన్, వీరితో పాటు మరో 12 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న లోకేష్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ మణికంఠ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల స్టేషన్‌కు వచ్చిన అధికారుల పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు సీఐ జయరామయ్య ఎస్పీకి నివేదిక అందజేశారు. దీనిపై విచారణ జరిపించిన ఎస్పీ కానిస్టేబుల్ తప్పిదం చేసినట్లు గుర్తించారు. దీంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

తైక్వాండో కోచ్‌కు అవార్డు

తిరుపతి సిటీ : టీటీడీ సీనియర్ అసిస్టెంట్, ఆ విద్యా సంస్థల తైక్వాండో కోచ్ మాస్టర్ కొమ్మినేని గోపి నాయుడుకు అరుదైన గౌరవం లభించింది. బెంగళూరు వేదికగా ఆదివారం జేపీ పార్క్ కప్-2024 ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. తిరుపతికి చెందిన మాస్టర్ కొమ్మినేని గోపి నాయుడు తైక్వాండో కోచ్‌గా అందించిన సేవలకు గానూ ఆర్గనైజర్ పెంచలయ్య క్రీడారత్న అవార్డును ప్రదానం చేశారు.

రహదారి పక్కనే చెట్ల నరికివేత



బిల్లేరు వద్ద నరికేసిన కలప వృక్షాలు



ట్రాక్టర్‌లో లోడుచేసి తరలిస్తున్న దృశ్యం

చౌడేపల్లె: మండలంలోని చౌడేపల్లె- పుంగనూరు ప్రధాన రహదారిపై బిల్లేరు సమీపంలో ఆదివారం పెద్ద పెద్ద వృక్షాలను నరికేశారు. పట్టపగలే రెండు రోజులుగా భారీ కలప వృక్షాలను నరుకుతూ వెళుతున్నారు. అయితే దీనిపై సంబంధిత ఆర్‌అండ్‌బీ, అటవీ, రెవెన్యూ అధికారులు సైతం నోరు మెదపకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రధాన రహదారికి ఓ వైపు కొన్నేళ్ల క్రితం నాటి పెంచిన భారీ వృక్షాలను నేలమట్టం చేశారు. సుమారు రూ.10 లక్షల విలువ చేసే చెట్లను కూల్చి సొమ్ము చేసుకున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టపగలే లారీలు, ట్రాక్టర్లలో కలపను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమార్కులు రోడ్డుకు ఇరువైపులా మిగిలిన భారీ వృక్షాలను కూల్చేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఓల్టా చట్టం, వృక్షాలను పెంచాలని ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు, ఆర్భాటాలు, కాగితాలకే పరిమితమయ్యాయని ప్రజలు ఆరోపణలు చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకొని మిగిలిన వృక్షాలను రక్షించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గిరిజనులకు రాయితీ రుణాలు ఇవ్వండి



సమావేశమైన గిరిజన సంక్షేమ సంఘం నాయకులు

రేణిగుంట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు సబ్సిడీ రుణాలిచ్చి కులవృత్తులను ప్రోత్సహించాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దినారి ప్రభాకర్ తెలిపారు. ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం కార్యకర్తలతో ఆయన ఆదివారం రేణిగుంటలో సమావేశమయ్యారు. కె.ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. గిరిజన తెగలో ఎరుకుల కులస్తుల చేతివృత్తులైన బుట్టల అల్లకం, బాతుల పెంపకం, ఉప్పు, పప్పు దినుసుల వ్యాపారం, సోది చెప్పడం వంటి వృత్తులు అంతరించిపోతున్నాయని తెలిపారు. తిరుపతి జిల్లాలో ఎరుకల సామాజిక వర్గానికి కాని వారికి ఎరుకుల కులస్తులుగా ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారికి మాత్రమే ఎరుకుల కులస్తులుగా సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్య దర్శి కె.హరినాథ్, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం నాయకులు ఈశ్వరమ్మ, చీరాలయ్య, మునిస్వామి, వెంకటరమణ, యశ్వంత్, రాధిక, ప్రభా కర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కుప్పం రిజర్వాయర్లపై ఆశలు!

- 0.7 టీఎంసీ సామర్థ్యంతో యామిగానిపల్లె
- 0.3 సామర్థ్యంతో మాడినపల్లె
- పనులకు రూ.535 కోట్లు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



యామగానిపల్లి వద్ద రిజర్వాయర్లకు ఎంపిక చేసిన పెద్దనాయన చెరువు

కుప్పం: హంద్రీనీవా ప్రాజెక్టు రెండో దశలోని కుప్పం ఉపకాలువలో అంతర్భాగంగా రెండు రిజర్వాయర్ల నిర్మాణం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా ప్రస్తుత ప్రభుత్వం వీటిని కోల్డ్ స్టోరేజిగా మార్చేలా కన్పిస్తోంది. కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి, సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేసింది. ఇందులో భాగంగా గతంలో అప్పటి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కుప్పం కాలువకు కృష్ణా జలాలను విడుదల చేశారు. అంతటితో ఆగకుండా కొత్తగా రెండు రిజర్వాయర్లను నిర్మించేందుకు నిర్ణయించి నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ రిజర్వాయర్ల పరిస్థితి ప్రశ్నార్థకం మారుతోంది.

గుడుపల్లె మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం సమీపం యామిగానిపల్లె వద్ద పెద్దనాయుని చెరువు ఉంది. ఈ చెరువును యామిగానిపల్లె రిజర్వాయర్‌గా ఆధునీకరించి 0.7 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యానికి పెంచి నిర్మాణ పనులు చేపట్టాలి. శాంతిపురం మండలంలోని మాదనపల్లె సమీపంలో పెద్దన్న చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని 0.3 టీఎంసీలకు పెంచి మాదనపల్లె రిజర్వాయర్‌గా మారుస్తారు. యామిగానిపల్లె, మాదనపల్లె రిజర్వాయర్లకు కుప్పం ఉపకాలువ నుంచి కృష్ణా జలాలను మళ్లించి నింపేలా ప్రణాళికను ఆమోదించారు. ఈ రెండు రిజర్వాయర్ల నిర్మాణం కోసం అప్పటి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూ.535 కోట్ల నిధులను మంజూరు చేశారు. కుప్పం ప్రజలకు తాగునీటి, పారిశ్రామిక అవసరాలకు నీటిని వినియోగించేలా నిర్ణయించారు. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందుకు ఇప్పటి ప్రభుత్వం టెండర్లను నిర్వహించి పనులు అప్పగించాల్సి ఉంది. అయితే కుప్పం ఉపకాలువకు లైనింగ్ పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపిన ప్రభుత్వం ఈ రిజర్వాయర్లకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. దీని ఫలితంగా కుప్పం నియోజకవర్గం నీటి వనరుల పెంపునకు నోచుకోకుండా పోతుంది. గత టీడీపీ ప్రభుత్వంలో కాలువ పనులు చేపట్టగా ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కాలువ పనులు పూర్తి చేయించగా నీటిని తరలించిన విషయం తెలిసిందే. అయితే కొత్త రిజర్వాయర్ల పనులు విషయంలో కొత్త ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాల్సి ఉంది. కుప్పానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నియోజకవర్గ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ కారణాలతో సంబంధం లేకుండా రిజర్వాయర్ల పనులకు అనుమతులు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.